క్లుప్తంగా

కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న వేదపండితులు

నక్కపల్లి: స్థానిక బండారు పేటలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారామ చంద్రుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రతిష్ఠించే స్వామివారి విగ్రహాలకు వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. పుణ్యాహవచనం, మండపారాధన, వాస్తుమండప పూజ, జయాది హోమాలు, నూతన కలశ స్థాపన తదితర పూజాధి కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమం జరిగింది.

స్కూల్‌కు క్రీడా పరికరాల వితరణ



క్రీడా పరికరాలు అందజేస్తున్న ఎన్‌ఆర్‌ఐ నాయుడు

మునగపాక: విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంఈవో–2 బుద్ద శివనాయుడు కోరారు. మండలంలోని రామారాయుడుపేట స్కూల్‌కు టి.సిరసపల్లికి చెందిన మాజీ సర్పంచ్ పొలమరశెట్టి చిన అప్పారావు కుమారుడు ఎన్‌ఆర్‌ఐ నాయుడు రూ.65 వేల విలువ చేసే ఊయల, జారుడుబల్ల, రంగులరాట్నం సమకూర్చారు. గురువారం వీటిని ఎంఈవో ప్రారంభించారు. పాఠశాలకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ముందుకు వచ్చిన ఎన్‌ఆర్‌ఐ నాయుడును అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాధాదేవి, పీఎంసీ చైర్మన్ వీరభద్రరావు, సీఆర్‌ఎంటీ మద్దాల గోవింద తదితరులు పాల్గొన్నారు.

16న నూకాంబిక ఆలయ వార్షికోత్సవం



నూకాంబిక అమ్మవారు

మునగపాక: మండలంలోని ఉమ్మలాడలో ఈ నెల 16న నూకాంబిక ఆలయ మొదటి వార్షికోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు మందా రాము తెలిపారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో హోమాలతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటలను భారీ అన్న సమారాధన ఏర్పాటు చేస్తున్నామన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, పాలకవర్గం, గ్రామ పెద్దల సహకారంతో నిర్వహించే వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

చికిత్సకు ఆధార్ తప్పనిసరి..



సూపరిండెంటెంట్ డాక్టరు ప్రసాద్

కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇ–హాస్పిటల్ విధానంలో భాగంగా చికిత్స కోసం వచ్చే రోగులు కచ్చితంగా ఆధార్‌కార్డు లేదా ఆధార్‌తో అనుసంధానం చేసిన ఫోన్ నంబరు గల మొబైల్‌ను వెంట తీసుకురావాలని సీహెచ్‌సీ సూపరిండెంటెంట్ డాక్టర్ ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొత్త విధానంతో రోగులు ఓపీలో ఆధార్ నంబరును నమోదు చేయించాల్సి ఉంటుందన్నారు. ఈ విధానం వల్ల రోగులు ఏ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లినా వారి రోగం, చికిత్స వివరాలు తెలుస్తాయన్నారు. దాంతో రోగులు ప్రత్యేకంగా చికిత్సకు సంబంధించిన ఫైల్‌ను తీసుకెళ్లవలసిన అవసరం ఉండదన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వాస్పత్రికి వెళ్లినా ఆధార్ నంబర్‌తో కేసు వివరాలు తెలుస్తాయని తెలిపారు. ఎవరైతే చికిత్స పొందుతారో వారి ఆధార్ మాత్రమే ఉండాలని, లేదా అనుసంధానం చేసిన మొబైల్ నంబరు వెంట ఉండాలని సూచించారు.

వేడుకగా ఫేర్‌వెల్ డే



మాట్లాడుతున్న హెచ్‌ఎం సత్యనారాయణ

ఎస్.రాయవరం: ఉన్నత చదువులకు పదో తరగతి చాలా కీలమని హెచ్‌ఎం సకురు సత్యనారాయణ తెలిపారు. గురువారం కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో ఫేర్‌వెల్ డే వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. అవసరమైన మెలకువలు నేర్పించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పక్కా భవనాలు కలేనా...?

- సామాజిక భవనాల్లో కొత్త పంచాయతీ కార్యకలాపాలు
- ప్రతిపాదనలకే పరిమితమైన కొత్త భవనాలు
- అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం హడావుడి
- స్థలాల పరిశీలనతో సరి..
- పాలకవర్గాల ఎదురు చూపులు

మునగపాక: పాలనా పరమైన ఇబ్బందులు లేకుండా ఉండేందుకు గత వైఎస్సార్‌సీపీ హయాంలో కొత్తగా పంచాయతీలను ఏర్పాటు చేశారు. ప్రజలకు సకాలంలో సేవలందించేందుకు నూతన పంచాయతీలను అందుబాటులోకి తీసుకువచ్చారు. జనాభాకు అనుగుణంగా నూతన పంచాయతీలు ఏర్పాటు జరిగినా ఇంతవరకు పక్కా భవనాలు లేవు. పాలకవర్గ సమావేశాలకు నిర్వహించేందుకు అవకాశం లేకుండా పోతోంది. దీనికి తోడు సామాజిక భవనాలు, అలాగే ఇతర భవనాల్లో తాత్కాలికంగా సేవలందిస్తున్నారు.

పాత పంచాయతీలు 21.. కొత్త పంచాయతీలు 6

మండల వ్యాప్తంగా గతంలో 21 పంచాయతీలు ఉండేవి. జనాభాకు అనుగుణంగా కొత్తగా పంచాయతీలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందుతాయన్న ఆశయంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. జనాభా ప్రాతిపదికన కొత్తగా ఆరు పంచాయతీలను ఏర్పాటు చేశారు. వాటిలో మూలపేట, నారాయుడుపాలెం, కాకరాపల్లి, గొల్లలపాలెం, రామగిరి, మల్లవరం పంచాయతీలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆయా పంచాయతీలకు సర్పంచ్‌లు, వార్డు సభ్యులు ఎన్నికై సంవత్సరాలు గడుస్తున్నా, ఇంతవరకు పక్కా భవనాలు లేక పాలకవర్గ సభ్యులతో పాటు పనులపై వచ్చే వారు సైతం ఇబ్బందులు పడుతున్నారు.



మండల పరిషత్ కార్యాలయం

పక్కా భవనాలు.. ప్రతిపాదనలకే పరిమితం

మండల వ్యాప్తంగా మంజూరైన కొత్త పంచాయతీలకు భవనాలు మంజూరు చేస్తామంటూ కూటమి ప్రభుత్వం ప్రకటనలు చేసింది. కొత్త భవనాలు మంజూరుకు ప్రతిపాదనలు చేసి నెలలు గడుస్తున్నా, ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. ప్రతి పంచాయతీకి రూ.32 లక్షలతో కొత్త భవనాలు నిర్మించేలా చర్యలు చేపట్టారు. ఇందుకు సంబంధించి ఆయా గ్రామాల్లో స్థలాలను అన్వేషించారు. మండల ఇంజినీరింగ్, ఉపాధి హామీ పథకం అధికారులు కొత్త భవనాల నిర్మాణాలకు స్థలాలను ఖరారు చేసిన సంగతి తెలిసిందే. ఇంతవరకు బాగానే ఉన్న భవనాల నిర్మాణాలకు చిల్లి గవ్వ మంజూరు కాలేదు. దీంతో కొత్త పంచాయతీలకు పక్కా భవనాలు అందని ద్రాక్షలా మిగిలాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా పక్కా భవనాలు అందుబాటులోకి తీసుకువచ్చేలా చూడాలని పాలకవర్గాలు కోరుతున్నాయి.



మూలపేటలో సామాజిక భవనంలో నిర్వహిస్తున్న పంచాయతీ కార్యాలయం

పాలనా పరమైన ఇబ్బందులు



ఏళ్ల తరబడి పంచాయతీలకు పక్కా భవనాలు లేక పాలనాపరమైన ఇబ్బందులు పడుతున్నాం. సామాజిక భవనంలోనే పంచాయతీ కార్యకలాపాలు నిర్వహించాల్సి వస్తోంది. సమస్యలు చెప్పుకునేందుకు వచ్చే వారు సైతం ఇబ్బందులు పడుతున్నారు. పక్కా భవనం నిర్మాణానికి నిధులు మంజూరుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బీశెట్టి గంగప్పలనాయుడు, సర్పంచ్, మూలపేట

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



కొత్త పంచాయతీలకు పక్కా భవనాల నిర్మాణాలు కలగానే మిగిలిపోతున్నాయి. కొత్త పంచాయతీల ఏర్పాటు జరిగినా ఇంతవరకు పక్కా భవనాలు అందుబాటులోకి రాలేదు. పక్కా భవనాలకు రూ.32 లక్షలు చొప్పున కేటాయిస్తున్నట్లు ప్రకటనలు చేశారు. వాటిని అమలులోకి తీసుకువచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– ఇల్లా శిరీషా, ఎంపీటీసీ, పాటిపల్లి

ప్రతిపాదనలు పంపించాం



కొత్తగా ఏర్పాటైన పంచాయతీలకు సంబంధించి పక్కా భవనాలు మంజూరుకు ప్రతిపాదనలు పంపాం. ప్రతీ పంచాయతీలో పక్కా భవనం నిర్మించేందుకు రూ.32 లక్షలు చొప్పున నిధులు అవసరముంది. ఇప్పటికే భవన నిర్మాణాలకు స్థలాలు గుర్తించాం. నిధులు మంజూరు కాగానే భవన నిర్మాణాలకు చర్యలు తీసుకుంటాం.

– ఎం.ఉషారాణి, ఎంపీడీవో

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మునగపాక: స్థానిక సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ మెయింటెనెన్స్‌లో భాగంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. రైతులు, గృహ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నూకాంబిక సేవలో మాజీ ఎమ్మెల్యే కన్నబాబు



అమ్మవారి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే కన్నబాబు రాజు తదితరులు

అచ్యుతాపురం: మండలంలోని మార్టూరు గ్రామంలో నూకాంబిక అమ్మవారి పండగ గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే కన్నబాబు రాజు దర్శించుకొని పూజలు చేశారు. అదే విధంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

32 మద్యం సీసాలు స్వాధీనం

కశింకోట: తేగాడలో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా దాడి చేసి, 32 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని అనకాపల్లి ఎక్సైజ్ సీఐ వైఎల్ నాయుడు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్. కన్నాజీరావు(32)ను పట్టుకుని అరెస్టు చేశామన్నారు. సారా తయారు చేసినా, విక్రయించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అనకాపల్లి ప్రోహిబిషన్ ఎక్సైజ్ సీఐ వై. లక్ష్మన్నాయుడు హెచ్చరించారు. జమాదుల పాలెంలో నవోదయం–2.0 నిర్వహించారు.

కేజీబీవీలో ఫుడ్ కమిషన్ సభ్యురాలి తనిఖీ



కేజీబీవీని తనిఖీ చేస్తున్న ఫుడ్ కమిషన్ సభ్యురాలు దేవి

నక్కపల్లి: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఫుడ్ కమిషన్ సభ్యురాలు జి. దేవి గురువారం తనిఖీ చేశారు. ఇక్కడ తరగతి గదులు, డార్మిటరీలు, డైనింగ్ హాళ్లను, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలను పరిశీలించారు. బాలికలకు పెడుతున్న భోజనాన్ని రుచి చూశారు. పాఠశాలలో అన్ని ప్రాంతాలను పరిశీలించారు. బోధన ఎలా ఉందని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని ఆరా తీశారు. పాఠశాలలో సదుపాయాలన్ని బాగున్నాయని భోజనం రుచికరంగా ఉందని విద్యార్థినులు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కష్టపడి చదువుకుని మంచి ఫలితాలు సాధించాలని ఆకంక్షించారు. పాఠశాల పరిసరాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈవో కుంచం నరేష్, పాఠశాల ప్రత్యేకాధికారి సలీమా, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థినులకు పరీక్ష సామగ్రిని అందజేస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం: దాతలు సహకారాన్ని సద్వినియోగపరచుకుని పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ప్రధానోపాధ్యాయుడు వీసం ప్రసాద్ ఆకాంక్షించారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో న్యూలైఫ్ చిల్డ్రన్ హోమ్ ప్రతినిధులు పరీక్ష సామగ్రిని గురువారం విద్యార్థినులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు శ్రీరాజు కులపతి, నీలిమ, భీమరాజు, కృష్ణప్రసాద్, యేసుబాబు తదితరులు పాల్గొన్నారు.

బోదకాలు పట్ల అప్రమత్తత అవసరం



బోదకాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

అచ్యుతాపురం: బోదకాల నివారణకు సంబంధిత వ్యాధిగ్రస్తులు తగిన జాగ్రత్తలు ఇంటి వద్దే తీసుకోవాలని వైద్యాధికారులు మానస, రవిబాబు తెలిపారు. గురువారం హరిపాలెం పీహెచ్‌సీలో బోదకాల వ్యాధిపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. వ్యాధి సంక్రమిస్తే ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. బోదకాల వ్యాధి ఉన్న ఎనిమిది మంది బాధితులకు టబ్బు, టవల్, సబ్బులు, ఆయింట్‌మెంట్ అందజేశారు. ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్, ఆరోగ్య బోధకులు రామలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, ఉమామహేశ్, గణేశ్, ఇందిర, లక్ష్మి, నాగేశ్వరరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సంత ఆశీలు వేలం రూ.10 లక్షలకు ఖరారు



వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం రూరల్: స్థానిక పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం వారపు సంత ఆశీలు వేలం పాట గురువారం నిర్వహించారు. గల్లా నాగమణి భర్త కన్నాజీ రూ.10.11 లక్షలకు ఆశీలు వేలం పాట కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా అచ్యుతాపురం ఈవోపీఆర్డీ శ్రీరాములు మాట్లాడుతూ వేలం పాట ద్వారా వచ్చిన మొత్తాన్ని పంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగిస్తామన్నారు. సర్పంచ్ కూండ్రపు విమలా నాయుడు, పంచాయతీ కార్యదర్శి శైలజారాణి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రామాలయ వేడుకలు ప్రారంభం



సీతారామాంజనేయ విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు



హోమంలో దంపతులు

మునగపాక: స్థానిక దళితవాడలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయం ఆవరణలో వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజున సీతారామాంజనేయుల విగ్రహాలకు వేదపండితులు వెలవలపల్లి కోటేశ్వర శర్మ మంత్రోచ్చారణల మధ్య పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. శ్రీరామ నామస్మరణతో దళితవాడ మార్మోగింది. ఈ వేడుకలను తిలకించేందుకు సమీప గ్రామస్తులు భారీగా తరలివచ్చారు. 14న విగ్రహాలను గ్రామంలో పలు సాంస్కృతిక ప్రదర్శనలతో ఊరేగింపు ఉంటుందని, 15న ఆలయ ప్రారంభోత్సవంతో పాటు విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం, మధ్యాహ్నం భారీ అన్న సమారాధనకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడాలి

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి కోరారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆమె మండల స్థాయి అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులతో అధికారులు సమన్వయం చేసుకుంటూ గ్రామాల్లో సమస్యలు గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు, మండల ఇంజనీరింగ్ అధికారి గులామ్, మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి, వెలుగు ఏపీఎం బాలరాజు, ఏపీవో శివఅప్పారావు, ఈవోపీఆర్డీ సోమరాజు సమావేశంలో పాల్గొన్నారు.

స్వీయ రక్షణకు తైక్వాండో



స్వీయ రక్షణపై అవగాహన కల్పిస్తున్న తైక్వాండో శిక్షకులు

ఎస్.రాయవరం: బాలికలకు స్వీయ రక్షణపై అవగాహన ఉండాలని ఎస్‌ఐ విభీషణరావు సూచించారు. తిమ్మాపురం కేజీబీవీలో చందు తైక్వాండో శిక్షణలో ఆయన పాల్గొని అవగాహన కల్పించారు. బాలికలపై తరచూ జరుగుతున్న దాడులు తాత్కాలికంగా అడ్డుకోవాలంటే తైక్వాండో నేర్చుకోవాలన్నారు. మంచి ఆహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. చదువుతోపాటు, క్రీడాస్ఫూర్తి, ఇతర వ్యాయామాలు నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కోచ్ చందు, ఎస్‌వో తదితరులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు దగ్ధం

దేవరాపల్లి: మండలంలోని గిరిజన పంచాయతీ వాలాబుకు సమీపంలోని కొండ ప్రాంతంలో గురువారం రెండు ద్విచక్ర వాహనాలు దగ్ధమయ్యాయి. చీడికాడ మండలం రెల్లలపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు పోడు సాగు పనుల నిమిత్తం తమ ద్విచక్ర వాహనాలను రోజూ మాదిరిగా కొండ దిగువున పార్కింగ్ చేసి వెళ్లారు. పనులు ముగించుకొని వచ్చి చూడగా పార్కింగ్ చేసిన రెండు ద్విచక్ర వాహనాలు కాలి బూడిదయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు బీడీ లేదా చుట్ట వెలిగించి పడేయడంతోనే మంటలు చెలరేగి ద్విచక్ర వాహనాలు దగ్ధమై ఉంటాయని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీంతో బాధితులు బోరున విలపిస్తున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

పెందుర్తి: గాజువాక ప్రాంతం నుంచి సబ్బవరానికి ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాపు జగ్గరాజుపేట వద్ద టాస్క్‌ఫోర్స్, పెందుర్తి పోలీసులు పట్టుకున్నారు. పూసర్ల అచ్చిబాబు అనే వ్యక్తి టాటా ఏస్ వాహనంలో 23 బస్తాల(900 కిలోల) పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్ ఎస్‌ఐ భరత్‌కుమార్, లా అండ్ ఆర్డర్ ఎస్‌ఐ అసిరితాత కలిసి కాపు కాసి వాహనాన్ని అడ్డుకున్నారు. పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరించాలి



వ్యవసాయ సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న ఏవో ఉమా ప్రసాద్

నక్కపల్లి: రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి ఉమా ప్రసాద్ తెలిపారు. గురువారం నక్కపల్లిలో వ్యవసాయశాఖ, డీఆర్‌డీఏ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్య భద్రత, పర్యావరణ సంరక్షణ దృష్ట్యా ప్రకృతి వ్యవసాయం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. నవధాన్యాల సాగు కోసం ప్రీమాన్యూస్ డ్రైసోయింగ్ వల్ల ఉపయోగాలు కోసం వివరించారు. నూరు శాతం ప్రకృతి వ్యవసాయం గురించి గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. ప్రకృతి వ్యవసాయం ఎక్కువగా చేస్తున్న జానకయ్యపేట గ్రామాన్ని నూరుశాతం సేంద్రియ విధానంలో మార్చాలన్నారు. వ్యవసాయ దాని అనుబంధ శాఖల సిబ్బంది సమష్టిగా పనిచేస్తే ఇది సాధించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయానికి ఏర్పడే అవరోధాలను గురించి తెలుసుకుని ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో సాయికుమారి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఆర్బీకే సిబ్బంది రాజ్యలక్ష్మి, మౌనిక, కొండలరావు, వెలుగు సీసీలు, సీఏలు, ఏపీవో, ఏపీఎంలు పాల్గొన్నారు.

చెప్పల దుకాణంలో అగ్నిప్రమాదం

రూ.15 లక్షల ఆస్తి నష్టం



కాలి బూడిదైన చెప్పులు, ఫర్నిచర్

పరవాడ: సంతబయలు గ్రామానికి చెందిన భూషణం చెప్పుల దుకాణంలో బుధవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. సుమారు రూ.15 లక్షల ఆస్తినష్టం జరిగింది. వివరాలు.. బుధవారం రాత్రి 9 గంటల సమయంలో దుకాణం మూసివేసి, భూషణం ఇంటికి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో షాపు నుంచి దట్టమైన పొగలు రావడాన్ని స్థానికులు గుర్తించి అనకాపల్లి, రాంకీ అగ్నిమాపక కేంద్రాలకు సమాచారం అందించారు. వెంటనే రాంకీ అగ్నిమాపక శకటం సిబ్బంది రంగంలోకి దిగి మంటలను అదుపు చేశారు. అప్పటికే దుకాణంలో ఉన్న చెప్పులు, ఫర్నిచర్ పూర్తిగా కాలిపోయి, ముద్దగా మారాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందని కొందరు, ఎవరో కావాలనే షాపునకు నిప్పు అంటించారని మరి కొందరు అంటున్నారు. చెప్పుల దుకాణం వెనుక వైపు నివసిస్తున్న సైకిల్ మెకానిక్ చెల్లయ్య అనే వ్యక్తికి చెందిన టైర్లు, ట్యూబులు కాలిబూడిదైనట్లు చెల్లయ్య వాపోయాడు. అగ్నిప్రమాదంపై పరవాడ రెవెన్యూ అధికారులు బాధితుల నుంచి వివరాలు సేకరించి, నివేదికను తహసీల్దార్ అంబేడ్కర్ అందించారు.